సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం, 1, మే, 2025



పచ్చిరొట్టతో భూసారం

భూములను సారవంతంగా మార్చుకుని అధిక దిగుబడులు సాధించాలంటే పచ్చిరొట్ట సాగు ఒక్కటే మార్గం. పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు రాయితీపై అందిస్తున్నారు. 8లో ▸



ఇటుకలు పడి కార్మికుడి మృతి

తణుకు జాతీయ రహదారిపై ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ట్రక్కు తిరగబడగా.. ఇటుకలు మీదపడడంతో ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురు గాయపడ్డారు. 8లో ▸



అకాల వర్షం.. రైతన్నకు నష్టం

అకాల వర్షం రైతన్నకు నష్టాన్ని మిగిల్చింది. ఆచంట నియోజకవర్గంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిపోవడంతో రైతులు నష్టపోయారు. 8లో ▸

న్యూస్‌రీల్

సరైన ఏర్పాట్లు లేకే భక్తుల మృతి



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: సింహాచలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవం సందర్భంగా ఏడుగురు భక్తులు చనిపోవడం అత్యంత దురదృష్టకరమని మండలి సభ్యుడు కౌరు శ్రీనివాస్ బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక బందోబస్తు, సరైన వసతి ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం దీన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు 50 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఇలాంటి అపచారం ఎప్పుడు చోటు చేసుకోలేదన్నారు.

పదవీ విరమణ చేసిన పోలీసులకు సత్కారం



పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ చేసిన వారిని సత్కరిస్తున్న ఏఎస్పీ

భీమవరం: పోలీసు శాఖలో అంకిత భావంతో చేసిన సేవలు ప్రసంశనీయమని జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు అన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన పోలీస్ సిబ్బందిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం సన్మానించారు. తాడేపల్లిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.కొండలరావు, భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ కె.భాస్కరరావు, నరసాపురం టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ విశ్వేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బి ఇన్స్‌పెక్టర్ దేశింశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలి



మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిశేషు

తాడేపల్లిగూడెం రూరల్: బీసీలు రాజకీయ శక్తిగా ఎదగాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు అన్నారు. బుధవారం మండలంలోని నీలాద్రిపురంలో సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు నివాసంలో బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఆదిశేషు మాట్లాడుతూ బీసీలకు అందాల్సిన ఫలాల కోసం కష్టించి పనిచేయాలన్నారు. బీసీలకు సేవ చేయడానికే బీసీ వెల్ఫేర్ జేఏసీ పనిచేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజమహేంద్రవరపు లక్ష్మణరావును నియమిస్తున్నట్లు వెల్లడించారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీసీలకు సేవ చేసే వారిని జేఏసీలో చేర్చాలని సూచించారు. బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి రఘు తదితరులు మాట్లాడరాఉ. బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా కమిటీలో నియమిస్తూ పలువురికి నియామకపు పత్రాలను అందజేశారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని 5 ప్రభుత్వ, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రవేశాల కన్వీనర్, ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పీ. రజిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో 804, 14 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఆయా కోర్సుల్లో 1672 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు కాపీ ప్రింట్‌ను తన ఒరిజినల్స్‌తో విద్యార్థి ఏదైనా ప్రభుత్వ ఐటీఐలలో మే 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 08812-230269 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

సీహెచ్‌ఓల ఆందోళనకు మద్దతు

ఏలూరు (టూటౌన్): ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గత మూడు రోజులుగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీహెచ్‌ఓలకు బుధవారం ఎన్‌జీవో నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఏపీ ఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్‌వి రామారావులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకుని వారికి మద్దతు తెలిపారు. న్యాయ మైన కోర్కెలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

గూడెం కూటమిలో మంటలు

- జనసేన ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మధ్య మాటల యుద్ధం
- కూటమి నేతలు కొందరు నా చావును కోరుకుంటున్నారన్న జనసేన ఎమ్మెల్యే
- టీడీపీ నేతలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆ పార్టీ నేతల ఆరోపణ
- మీ త్యాగాలతో ఎమ్మెల్యే కాలేదంటూ బొలిశెట్టి వ్యాఖ్యలు





వలవల బాబ్జి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'మా కూటమి నేతలు కొంతమంది నేను తొందరగా చనిపోతే బాగుండును... ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే అయిపోవాలని కోరుకుంటున్నారు.. నేనేమి వాళ్ల త్యాగాలతో గెలవలేదు.. నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు.. ఎన్‌డీఏ ఎమ్మెల్యేను. నా చావును కోరుకోవడం అన్యాయం.. నేను చనిపోయాక ఎమ్మెల్యే అవ్వాలనుకుంటున్న వాళ్ళ ఆకాంక్ష నెరవేరాలని కోరుకుంటున్నాను' అంటూ టీడీపీ ఇన్‌ఛార్జి వలవల బాబ్జిని ఉద్దేశించి జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి.

పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన, టీడీపీ నేతల మధ్య విభేదాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే అనేక నియోజకవర్గాల్లో ఇరు పార్టీల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది. తాజాగా తాడేపల్లిగూడెంలో మొదలైన రాజకీయ పోరు తారాస్థాయికి చేరింది. పొత్తుల్లో భాగంగా జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌కు సీటు కేటాయించడంతో గెలుపొందారు. ఇదే స్థానం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆశించి భంగపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమన్న రీతిలో వివాదాలు కొనసాగుతున్నాయి. అక్రమ గ్రావెల్, మైనింగ్, పేకాట శిబిరాలు, బెల్టుషాపులు, వైన్ షాపుల వసూళ్ల వ్యవహారంలో మొదలైన విబేధాలు తాజాగా రచ్చకెక్కాయి. ఇద్దరు నేతల మధ్య అధికారులు పూర్తిగా నలిగిపోతున్నారు.

అధికారంలో ఉన్నామా.. ప్రతిపక్షంలో ఉన్నామా?: టీడీపీ నేతలు

రెండురోజుల క్రితం నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశం పార్టీ పరిశీలకుడు నక్కా చిట్టిబాబు నేతృత్వంలో జరిగింది. ఈ సభలో టీడీపీ నేతలు జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి తీరుపై విమర్శలు గుప్పించారు.

మేము అధికారంలో ఉన్నామా.. ప్రతిపక్షంలో ఉన్నామా అన్న విషయం తెలియడం లేదని.. చిన్న పని కూడా కార్యకర్తలకు జరగడం లేదని.. పార్టీ నేతలకు ఎక్కడా ఆహ్వానాలు గాని, ప్రొటోకాల్ గాని లేదని, చిన్న పోస్టులు కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి వేయించే పరిస్థితి లేదని ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఏకపక్ష ధోరణిలో ఎస్సై మొదలుకొని మున్సిపల్ కమిషనర్ వరకు తన మాటే వినాలని, టీడీపీ వాళ్ళకు పని చేస్తే సహించేది లేదని హుకుం జారీ చేశారని ఆరోపణలు గుప్పించారు. టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఎన్ఆర్‌జీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు, అతని వార్డులో రెండు సీసీ రోడ్లు వేయాలని అధికారులకు చెప్పినా ఎవరూ స్పందించడం లేదని సమావేశంలో ఆరోపించారు. ఈ పరిణామాల క్రమంలో బుధవారం నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో బొలిశెట్టి టీడీపీ నేతల ఆరోపణలపై పరోక్షంగా ఘాటుగా స్పందించారు.



ఎమ్మెల్యే బొలిశెట్టి

ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల గెలవలేదు

తాను ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల గెలవలేదని, మరో పిఠాపురం చేస్తానంటే నేను గాజులు తొడుక్కుని కూర్చోలేదని, కొందరి నాయకుల్లాగా స్థలాలు, పొలాలు పూడ్చుకోలేదని ఎవరి త్యాగం వల్ల తనకు సీటు రాలేదని ఎమ్మెల్యే బొలిశెట్టి బుధవారం వ్యాఖ్యానించారు.

అధికారులను ఇబ్బంది పెట్టినా, బెదిరించినా సహించనని ఎలాంటి హోదా లేకుండా అధికారులను ఇంటికి పిలిచి నాకు తెలియకుండా టీడీపీ నేతలు సమీక్షా సమావేశాలు ఎలా పెడతారంటూ ఆరోపించారు.

చిచ్చు రేపిన అక్రమ తవ్వకాలు

నియోజకవర్గంలో ఎర్రకాల్వతో సహా అక్రమ గ్రావెల్ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నేతలే రింగ్ లీడర్లుగా మారి భారీగా తవ్వకాలు చేసి ఎమ్మెల్యే సొంత స్థలంలో, టీడీపీ ఇన్‌చార్జి సొంత లేఅవుట్లలో మట్టిని నింపుతున్నారు. ఈ వ్యవహారాల్లో ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు మొదలయ్యాయి. వైన్ షాపులు, అధికారుల పోస్టింగులు, పనుల కేటాయింపులు ఇలా అన్నింటిలోనూ ఈ విభేదాలు పెరిగి వివాదానికి దారితీశాయి. తాడేపల్లిగూడెం కమిషనర్, కొందరు ఎస్సైలు, తహసీల్దార్లను టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో బెదిరిస్తున్నారని, ఎమ్మెల్యే జనసేన అయినా పైన ప్రభుత్వం మాదని నియోజకవర్గంలో లేకుండా చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని జనసేన ఎమ్మెల్యే బహిరంగంగా ఆరోపించారు. అధికారుల జోలికి వస్తే ఎవరిని ఉపేక్షించనని.. ప్రజలు ఓట్లు వేసి అవకాశం ఇచ్చారు కాబట్టి ఎమ్మెల్యేగా గెలిచానని, చిల్లర వ్యవహారాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ పరోక్షంగా హెచ్చరించారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్ష



భీమవరంలో సీతా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం భీమవరం బీవీ రాజు విద్యాసంస్థల్లోని సీతా పాలిటెక్నిక్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం సెంటర్‌కు ఎంతమందిని కేటాయించారు, ఎంతమంది హాజరయ్యారనే వివరాలను చీఫ్ కోఆర్డినేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లాలో భీమవరంలో 4, తాడేపల్లిగూడెంలో 2, తణుకులో 8, నరసాపురంలో 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 7,254 మంది ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 6,489 మంది హాజరయ్యారని చెప్పారు.

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా వ్యాప్తంగా మే 4న నిర్వహించే నీట్ యూజీ-పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేశామని, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి నీట్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లపై నీట్ యూజీ అధికారులు, సూపరింటెండెంట్‌లు, విద్యాశాఖాధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని తాడేపల్లిగూగెంలోని నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో సెంటర్లు ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు మొత్తం 2,100 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహించే పరీక్షకు ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని చెప్పారు. దివ్యాంగ విద్యార్థులకు పరీక్ష కేంద్రంలో వీల్ చైర్స్, సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. గూగుల్ మీట్‌లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డీఈఓ ఈ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మృతి కూటమి ప్రభుత్వ వైఫల్యమే

దేవదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు ఆగ్రహం



తాడేపల్లిగూడెం అర్బన్: కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్లే సింహాచలంలో భక్తులు ప్రాణాలు కోల్పోయారని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే హిందూ ఆలయాల్లో వరుసగా ఘోరాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో లడ్డూ కల్తీ అయ్యిందంటూ భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రచారం చేసి.. చివరకు సుప్రీంకోర్టుతో మొట్టికాయలు తిన్నా చంద్రబాబుకు బుద్ధి రాలేదన్నారు. తిరుపతిలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్ల ముందే కదులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన వాదినని చెప్పుకుంటున్న పవన్ కల్యాణ్ ఆనాడు కేవలం క్షమాపణలు చెప్పి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. శ్రీ కూర్మంలో నక్షత్ర తాబేళ్ల చనిపోతే వాటికి పోస్టుమార్టం చేయకుండా ఈవో ఆఫీసు వెనుకే దహనం చేయడం చంద్రబాబు ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు నిదర్శనమన్నారు. తిరుమలలో వందలాది గోవులు మరణిస్తే.. నిర్లక్ష్య ధోరణితో మాట్లాడటం చంద్రబాబుకే చెల్లిందని మండిపడ్డారు.

టెండర్లను రద్దు చేసి.. దోపిడీకి పాల్పడ్డారు

రాష్ట్రంలో ఎన్ని ఘోరాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం అవినీతిని వీడటం లేదని కొట్టు సత్యనారాయణ మండిపడ్డారు. వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ నిధులతో పలు ఆలయాలను అభివృద్ధి చేశామని చెప్పారు. రూ.50 కోట్లతో సింహాచలం ఆలయాన్ని అభివృద్ధి చేశామని.. ఇప్పటికీ కొనసాగించాల్సిన అభివృద్ధి పనుల టెండర్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. వారికి కావల్సిన వ్యక్తులకు వాటిని కట్టబెట్టిందని దుయ్యబట్టారు. అభివృద్ధి పనుల అంచనాలను పెంచి దోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణాలకు పచ్చ మీడియా రక్షణ కవచంలా పనిచేస్తోందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడతానన్న పవన్‌కల్యాణ్.. ఇప్పుడు ఆలయాల్లో ఇన్ని ఘటనలు జరుగుతున్నా ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు.

అమాయక భక్తులు బలి కావాల్సిందేనా..?

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు అర్బన్: చంద్రబాబు పాలనలో అమాయక భక్తులు బలికావాల్సిందేనని మరోసారి రుజువు చేశారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవత్ స్వరూపాన్ని తనివితీరా చూడాలనే ఉద్దేశంతో ఆలయాలకు వస్తున్న భక్తుల ప్రాణాలను కూటమి ప్రభుత్వం హరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాచలం అప్పన్న స్వామి చందనోత్సవాన్ని తిలకించేందుకు వెళ్లిన భక్తులు భద్రతా లోపం వల్ల అసువులు బాసారని దుయ్యబట్టారు. సనాతన ధర్మం అంటూ హంగామా చేసేవారు ఇప్పుడు ఏం చెబుతారని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలంటే హడావుడి చేయాల్సిన అవసరం లేదని, మీకు సనాతన ధర్మం అనే అర్హత లేదని విమర్శించారు. అప్పన్న స్వామి దర్శనానికి రూ.300 టికెట్ తీసుకుని వచ్చిన భక్తుల ప్రాణాలను నిర్లక్ష్యంగా వ్యవహరించి బలిగొన్నారన్నారు. గత పాలనలో చంద్రబాబు ప్రచార పిచ్చితో పుష్కరాల్లో 29 మందిని బలితీసుకోగా ఇటీవల తిరుపతిలో తొక్కిసలాటలో అమాయక భక్తులు మరణించారని గుర్తు చేశారు. ఆలయ ఈవోతో పాటు కాంట్రాక్టర్, ఇతర బాధ్యులందరిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలని, మృతుల కుటుంబ సభ్యులకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.25 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పశువధ కర్మాగారం మీ పాపమే కదా

టీటీడీలో గోవుల ప్రాణాలు కూడా తీసేస్తున్నారని, ఇదంతా కూటమి ప్రభుత్వ చేతకానితనమేనని మాజీమంత్రి కారుమూరి విమర్శించారు. తణుకులో రక్తపాతం సృష్టిస్తున్న పశువధ శాల స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన, ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రోత్సాహంతోనే నడుస్తుందని విమర్శించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జోరుగా పేదలకందాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని విమర్శించారు. పొగాకు, కోకో, మిర్చి, టమోటా, ఆయిల్‌పాంకు గిట్టుబాటు ధరలేక రైతులు అల్లాడుతున్నారని.. కరెంటు బిల్లులు చూస్తుంటే షాక్ కొడుతున్నాయని విమర్శించారు.

మైన్స్ కార్యాలయం ఖాళీ

- భర్తీకి నోచుకోని ఏజీ, ఆర్‌ఐ, టీఏ, డీఏఓ పోస్టులు
- లాంగ్ లీవ్‌లో మిగతా అధికారులు
- జూనియర్ అసిస్టెంట్, అటెండర్ మాత్రమే విధుల్లో
- పట్టించుకునే వారు లేక జిల్లాలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా



సిబ్బంది లేక ఖాళీ కుర్చీలతో వెలవెలబోతున్న కార్యాలయం

సాక్షి, భీమవరం: జిల్లాలోని గనులు, భూగర్భ శాఖ కార్యాలయం సిబ్బంది లేక అలంకారప్రాయంగా మిగిలింది. నెలల తరబడి పోస్టులు భర్తీకాకపోవడం, ఉన్న వారు సెలవు, డిప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలతో వెలవెలబోతోంది. ఇన్‌చార్జి అధికారులు అప్పుడప్పుడు చుట్టపుచూపుగా వచ్చి వెళుతున్నారు. పట్టించుకునే వారు లేక జిల్లాలో ఇసుక, గ్రావెల్, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరంలో గత ప్రభుత్వం జిల్లా గనులు, భూగర్భశాఖ కార్యాలయాన్ని ఏర్పాటుచేసింది. గతంలో ఏలూరులో ఉండే కార్యాలయం చేరువగా రావడంతో ప్రజలకు సేవలు మెరుగయ్యాయి. ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లోని వశిష్ట గోదావరి తీరం, నరసాపురం నియోజకవర్గంలోని సముద్ర తీరం వెంట ఇసుక, తాడేపల్లిగూడెం ప్రాంతంలో గ్రావెల్, ఉండి, భీమవరం నియోజకవర్గాల్లో ఆక్వా చెరువుల పేరిట మట్టి అక్రమ తవ్వకాలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే వెళ్లి వాటిని అడ్డుకునే వీలుండేది. అక్రమ తవ్వకాలు చేసిన వారికి జరిమానాలు విధించేవారు.

లీజులు లేక పోస్టులు ఖాళీ : వశిష్ట గోదావరి తీరం వెంట జిల్లాలోని సిద్ధాంతం 1, 2, కరుగోరుమిల్లి, కోడేరు, నడిపూడి 1, 2 ర్యాంపులు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, యలమంచిలి లంక, చించినాడ, మాధవాయిపాలెంలోని డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా గతంలో ఇసుక తవ్వకాలు చేసేవారు. గత ఏడాది గోదావరి వరదల తర్వాత నవంబరులో ర్యాంపులు తెరుచుకుంటాయని భావించారు. జిల్లాలోని గోదావరి తీరం కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్)లోకి వెళ్లడంతో ర్యాంపులు, డీసిల్టేషన్ పాయింట్లన్నీ మూతపడ్డాయి. మైనింగ్ శాఖకు జిల్లాలో లీజులు లేక భీమవరంలోని కార్యాలయం కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కార్యాలయ సూపరింటెండెంట్ లాంగ్ లీవ్‌పై వెళ్లిపోగా, సర్వేయర్ డిప్యుటేషన్‌పై ఏలూరులో పనిచేస్తున్నారు. ఒక అసిస్టెంట్ జియాలజిస్ట్ (ఏజీ), ఒక రాయల్టీ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ), ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్(టీఏ)లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఏఓ), ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్‌లు, చైన్‌మెన్, డ్రైవర్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరు నెలల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఖాళీలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. పూర్వపు ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన విజిలెన్స్ ఏడీ ఇక్కడ ఇన్‌చార్జి ఏడీగా, ఆయా ఖాళీల్లో ఏలూరుకు చెందిన అధికారులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడు పని ఉన్నప్పుడు వచ్చి వెళుతున్నారు. ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన వారు అధికారులు అందుబాటులో లేక ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వస్తోంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



పాలకొల్లు నియోజకవర్గంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయమై ఇటీవల మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఏలూరులో ఉన్నామని, ఉమ్మడి జిల్లా అంతా తామే చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. కార్యాలయానికి వెళ్తే ఎవరూ అందుబాటులో ఉండటం లేదు.

– కలవల వెంకట సురేష్‌కుమార్, మేడపాడు

రెచ్చిపోతున్న మట్టి, ఇసుక మాఫియా



ఆరుగొలనులో గ్రావెల్ తవ్వకాలు

జిల్లాలో మైనింగ్ లీజులు లేనప్పటికీ పట్టించుకునే వారు లేక నిబంధనలకు విరుద్ధంగా ఆచంట, యలమంచిలి, పెనుగొండ మండలాల్లోని గోదావరి తీరంలో బొండు ఇసుక, నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సముద్ర తీరం వెంట ఇసుక, తాడేపల్లిగూడెం రూరల్‌లోని ఆరుగొలనులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగిపోతున్నాయి. వీటిపై ఫిర్యాదులు చేస్తే వెళ్లి పరిశీలించే పరిస్థితి ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పోస్టులు నియామకం చేయడం ద్వారా జిల్లాలో అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

దుశ్శాసన పాలన తలపించేలా..

ఉండిలో ఇళ్ల కూల్చివేతపై రిటైర్డ్ ఐఏఎస్ శ్రీనివాసులు

సాక్షి, అమరావతి: హైకోర్టు స్టే ఉల్లంఘించి ఇల్లు కూల్చారని,, పేదలపై మానవత్వం చూపలేదని, మానవ హక్కులను ఉల్లంఘించి ఈడ్చిపారేసి బుల్డోజర్లతో ఇళ్లను కూల్చేయడం అత్యంత దుర్మార్గమని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసులు మండిపడ్డారు. ఉండి నియోజకర్గంలో ఇళ్ల కూల్చివేతపై బాధితులతో కలిసి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బుధవారం విజయవాడలోని బాలోత్సవ భవనంలో చర్చ వేదిక నిర్వహించింది. ముఖ్య అతిథి శ్రీనివాసులు మాట్లాడుతూ.. సామాన్లు నేల పాలు చేసి దౌర్జన్యంగా ఇళ్లను కూల్చివేయడం చూస్తే రాష్ట్రంలో దుశ్శాసన పాలనను మరిపించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు.

ఒకవైపు ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న వారికి 150 గజాల వరకు ఉచితంగా ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటిస్తూనే.. మరోవైపు పేదల ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. పేదలకు అండగా వెళ్ళి అన్యాయాన్ని ఖండించిన సీపీఎం నాయకులపై రాచరిక పాలనను మరిపించేలా ఉన్నత పదవిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నోటికొచ్చినట్టు మాట్లాడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ధ్వజమెత్తారు. చర్చా వేదికలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బీకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పీహెచ్ కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ చర్చావేదికలో ఐలూ నాయకులు మాధవరావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైస్కూల్ గ్రౌండ్‌లో మద్యం సేవించిన ఇద్దరిపై కేసు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఈనెల 28న మద్యం సేవించి, వివాదానికి కారణమైన ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులపై స్థానిక పోలీస్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. వివరాల ప్రకారం.. దేవస్థానంలో పారిశుద్ధ్య పనులకు వినియోగించే ట్రాక్టర్‌ను నడిపే డ్రైవర్ కందికొండ భూషణం, స్కావెంజర్ కొండాబత్తుల సూరిబాబు ఈనెల 28న మధ్యాహ్నం హైస్కూల్ గ్రౌండ్‌లోని స్టేజీపై కూర్చుని మద్యం సేవించారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అది కాస్తా వివాదంగా మారింది. దీనిపై ఆలయ అధికారులు స్పందించారు. దేవస్థానం సెక్యూరిటీ సూపర్‌వైజర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన భూషణం, సూరిబాబు లపై పోలీసులు పెట్టీ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ఏసుబాబు మృతదేహం

నూజివీడు: మండలంలోని బత్తులవారి గూడెం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం పాతముప్పర్రుకు చెందిన రంజుల ఏసుబాబు (34) మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై మైలవరం వెళ్తుండగా బత్తులవారిగూడెం శివారులో వెనక నుంచి బొలేరో వాహనం వచ్చి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన ఏసుబాబును పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో మృతిచెందాడు. రూరల్ ఎస్సై జ్యోతీబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టమ్ నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు బుధవారం అప్పగించారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ఏలూరు రూరల్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నట్లు డీఎస్‌డీఓ బి శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిబిరాల్లో ఈనెల 31వ తేదీ వరకూ 8 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ అందించి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకోసం జిల్లాలోని పలు ప్రాంతాల్లో 50 శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అథ్లెటిక్స్, అర్చరీ, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, హేండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖోఖో, రోయింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగా, కయాకింగ్, స్కేటింగ్ వంటి విభాగాల్లో జిల్లాలో ఎంపిక చేసిన శిబిరాల్లో తర్ఫీదు ఇస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐసీఎస్ఈ ఫలితాల్లో సెంట్ ఆన్స్ ప్రభంజనం


విద్యార్థులను అభినందిస్తున్న సెంట్ ఆన్స్ విద్యాసంస్థల అధినేత అద్దంకి విజయకుమార్

తాడేపల్లిగూడెం : పదో తరగతి ఐసీఎస్ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుభి మోగించినట్టు పట్టణంలోని సెంట్ ఆన్స్ విద్యాసంస్థల అధినేత అద్దంకి విజయకుమార్ తెలిపారు. తమ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత శాతం సాధించారన్నారు. బీవీ సూరజ్ 97 శాతం, జి.నేహశ్రీ 95 శాతం, సీహెచ్.కిరణ్ సాయి భాస్కర్ 94 శాతం, టి.మోహన సౌమ్య 93 శాతం, పి.రేవతి లక్ష్మి నరసింహ 93 శాతం, ఎం.హేమ సరిత 92 శాతం, బి.సాహితి 91 శాతం సాధించారన్నారు. 90 శాతం పైగా మార్కులు సాధించిన వారు ఏడుగురు, 80 శాతం పైన మార్కులు సాధించిన వారు 35 మంది, 70 శాతం పైగా మార్కులు సాధించిన వారు 58 మంది, 60 శాతం మార్కులు పైగా 70 మంది సాధించారని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐసీఎస్ఈ కరిక్యులం అవలంభించడం వల్ల ఈ ఫలితాలు వచ్చాయన్నారు. ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.


రైతు కూలీ కష్టం ఇలా..


బతుకు బరువు మోస్తూ..


ఇనుమైనా వంగాల్సిందే..


చెమట చిందించి..


బతుకు బండి లాగుతూ..

కార్మిక లోకం.. మీకు సలాం

రక్తాన్ని చెమటగా మార్చి ఎండనక... వాననక కష్టపడి తమ కుటుంబాలను పోషించడానికి రోజువారీ వేతనాల కోసం పనిచేస్తూ శ్రమిస్తున్న కార్మికులు ఎంతో మంది ఉన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో సంస్థలు, సంఘాలు పనిచేస్తున్నా.. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇప్పటికీ మిథ్యగానే కనిపిస్తోంది. కార్మికుల వేతనాల కోసం ఎన్నో చట్టాలు వచ్చినా అవి ఆచరణలో మాత్రం శూన్యంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ కార్మిక దినాన్ని అధికారికంగా, సంఘాలపరంగా ప్రతి ఏటా నిర్వహిస్తున్నా వారికి మాత్రం న్యాయం జరగడం లేదు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితిలో కూలి పనులే దిక్కుగా నిత్యం శ్రమిస్తున్న కార్మికులకు మేడే సందర్భంగా 'సాక్షి' సలాం..

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

పచ్చిరొట్ట సాగుతో భూసారం మెండు

- రసాయన ఎరువుల వినియోగంతో అనర్థాలు
- మెట్ట భూముల్లో లోపిస్తున్న పోషకాలు
- భూసారం, అధిక దిగుబడుల కోసం పచ్చిరొట్ట సాగు మేలంటున్న నిపుణులు

పాడి - పంట


జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పచ్చిరొట్ట సాగు చేస్తున్న దృశ్యం

చింతలపూడి: రసాయన ఎరువుల వాడకం నానాటికీ పెరుగుతుండడంతో భూసారం తీవ్రంగా దెబ్బతింటోంది. దీంతో పోషకాల లోపం ఏర్పడి పంటలు చీడ పీడల బారిన పడి రైతులు నష్టాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పంట భూములను సారవంతంగా మార్చుకుని అధిక దిగుబడులు సాధించాలంటే పచ్చిరొట్ట సాగు ఒక్కటే మార్గం. రైతులు తమ పొలాల్లో పంటలు సాగులో లేనప్పుడు పచ్చిరొట్ట సాగు చేసుకోవాలి. తొలకరికి ముందు వివిధ రకాల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు రాయితీపై అందిస్తున్నారు. ప్రతి ఏటా వేసవిలో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు వాటి నివేదికలను వ్యవసాయశాఖ అందచేస్తుంది. భూసారాన్ని పెంచడానికి రైతులు కనీసం రెండు పంటలు వేసిన తరువాత పచ్చిరొట్ట పైర్లు సాగుచేయాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి నాగకుమార్ తెలిపారు.

- పచ్చిరొట్ట సాగు వల్ల భూసారం పెరగడమే కాక చీడ, పీడల బెడద తగ్గుతుంది. దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. భూసారం పెంచే పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, పిల్లి పెసర సాగు చేసి ప్రయోజనం పొందవచ్చు.
- సేంద్రియ పదార్థాలను నేలకు అందించడం, కలుపు మొక్కలను నివారించడం, నేలలో జీవ రాశులకు ఆహారంగా, మొక్కలకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలను అందించే సాధనాలుగా పచ్చిరొట్ట పైర్లు ఉపయోగపడతాయి.
- ప్రస్తుతం పొలాలకు కృత్రిమంగా ఉపయోగిస్తున్న నత్రజని వాడకాన్ని 20 నుంచి 30 శాతం వరకూ ఆదా చేసుకోవచ్చు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసిన భూముల్లో పంటలు ఆరోగ్యంగా పెరిగి, చీడ, పీడలను తట్టుకోవడమే కాకుండా నేలలో నీరు, రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారిపోకుండా పచ్చిరొట్ట అడ్డుకుంటుంది.
- నేలలో చౌడును తగ్గించి శీతాకాలంలో కూడా నేలలోని ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉండటానికి పచ్చిరొట్ట సాగు ఉపకరిస్తుంది. చౌడు భూముల్లో జీలుగ, నీరు నిల్వ ఉండే భూముల్లో జనుము వేసుకోవడం ఉత్తమం.
- జీలుగ హెక్టారుకు 20 టన్నులు, జనుము 21 టన్నులు, పిల్లి పెసర 18 టన్నుల దిగుబడి వస్తుంది. ఇటు పశుగ్రాసం కొరతను తీర్చడమే కాక భూమిని సారవంతం చేస్తాయి. ఎరువు కోసమైతే పచ్చిరొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియదున్నుకోవాలి.
- పైరు వయసు 50 రోజుల నుంచి 60 రోజులు మించకుండా కలియదున్ని ఒకటి రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవాలి. జీలుగ, పిల్లి పెసర విత్తనాలు ఎకరానికి 16 కిలోలు, జనుము 20 కిలోల చొప్పున వేసుకోవాలి.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై రైతులకు పచ్చి రొట్ట విత్తనాలు అందిస్తుంది. సబ్‌డివిజన్‌లో ఈ ఏడాది 3,152 క్వింటాళ్లు పచ్చి రొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. చింతలపూడి మండలంలో 1,475 క్వింటాళ్లు, కామవరపుకోట మండలంలో 525 క్వింటాళ్లు, లింగపాలెం మండలంలో 332 క్వింటాళ్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 820 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.


బి నాగకుమార్
వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

రాష్ట్రంలో అధ్వానంగా శాంతిభద్రతలు


పిడపర్తి ముత్తారెడ్డి, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

చింతలపూడి: రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా మారాయని పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడపర్తి ముత్తారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మీడియాపై దాడులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రాణాలకు తెగించి వార్తలు సేకరించే జర్నలిస్టులపై భౌతిక దాడులు చేస్తుండడం దారుణమని అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తన అనుచరులతో కలిసి వెళ్లి ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయం ముందు హల్‌చల్ చేయడమే కాక ఆయన అనుచరులు అక్కడి కంప్యూటర్లను ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ప్రవర్తించిన చింతమనేనిపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అదే విధంగా శ్రీకాళహస్తిలో వార్త సేకరణకు వెళ్లిన సాక్షి విలేకరిపై జరిగిన దాడి కూడా మీడియాపై దాడులకు ప్రత్యక్ష నిదర్శనం అన్నారు. ఈ దాడులు భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు. నిత్యం మీడియాపై, మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను దేశంలోని మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు.

ఇటుకలు మీదపడి కార్మికుడి దుర్మరణం

- తణుకు జాతీయ రహదారిపై అదుపు తప్పి ఇటుక ట్రాక్టర్ బోల్తా
- ఒకరి మృతి.. మరో ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో ఇటుకల కింద నుంచి ఏసు మృతదేహాన్ని లాగుతున్న దృశ్యం

తణుకు అర్బన్ : తణుకు జాతీయ రహదారిపై ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టరు ట్రక్కు బోల్తా పడిన ఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం చెందగా ముగ్గురు గాయపడ్డారు. ఘటనలో ట్రాక్టరు ట్రక్కుపై ప్రయాణిస్తున్న కార్మికుడు నక్కా ఏసు (42)పై ఇటుకలు పడడంతో మృతిచెందాడు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు నుంచి తాడేపల్లిగూడెం ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టరు తణుకు జాతీయరహదారి పాత టోల్‌గేట్ ప్రాంతానికి వచ్చేసరికి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఇటుకలోడు దింపే కార్మికులు పెనుగొండ మండలం వడలి గ్రామానికి చెందిన నక్కా ఏసు, సీహెచ్ నాగబాబు, తొంట దుర్గాప్రసాద్, మద్దే ఏసు ఇటుక లోడుతో ఉన్న ట్రాక్టరుపై ప్రయాణం చేస్తున్నారు. ట్రక్కు తిరగబడిన వెంటనే కింద పడిన ఏసుపై ఇటుకలు పడిపోయాయి. స్థానికులు, తోటి కార్మికులు బలవంతంగా ఇటుకల్లోంచి అతడిని బయటకు లాగినా అప్పటికే మృతి చెందాడు. ఏసు మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీకి తరలించగా, క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వడలి.. కన్నీటి కడలి

వడలి గ్రామానికి చెందిన నక్కా ఏసు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని కుటుంబసభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. మృతుడికి భార్య భవానితోపాటు 8వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. ఒక రోజు క్రితమే నేను లేకపోతే మీరు ఎలా బతుకుతారని ఏసు తనను నిలదీశాడని భార్య భవాని రోదిస్తూ చెబుతున్న తీరు స్థానికులను కలచివేసింది. ఇలా అర్థంతరంగా వెళ్లిపోయావు.. మాకెవరు దిక్కంటూ ఆస్పత్రి ఆవరణలో ఆమె రోదనలు మిన్నంటాయి. తణుకు ఏఎస్సై రంగారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకాల వర్షం.. రైతన్నకు నష్టం


సిద్ధాంతంలో నేలకొరిగిన వరి చేలు


పెనుగొండలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు


సిద్ధాంతంలో ధాన్యాన్ని ఆరబెట్టుకొంటున్న రైతన్నలు

పెనుగొండ: అకాల వర్షం రైతన్నకు నష్టాన్ని మిగిల్చింది. ఆచంట నియోజకవర్గంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. వేసవి కాలం కావడంతో రైతులు కళ్లాల్లోని ధాన్యానికి పూర్తి స్థాయి రక్షణ ఏర్పాటు చేయలేదు. అరగంట పాటు భారీ వర్షం కురవడంతో రైతులు ఉరుకులు, పరుగులు పెట్టినా పూర్తిస్థాయిలో ధాన్యాన్ని కాపాడుకోలేకపోయారు. ప్లాస్టిక్ బరకాలు కప్పినా కొంతమేర ధాన్యం వర్షార్పణం అయింది. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 11,782 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12,103, ఆచంట మండలంలో 10,600, పోడూరు మండలంలో 12,800 ఎకరాల్లో వరి సాగు చేశారు. దీనిలో ఎంటీయూ 1121 వరి రకం అధికంగా సాగు చేయగా, పీఆర్ 126, ఎంటీయూ 1153 రకాలు కూడా సాగు చేశారు. వీటిలో పెనుగొండ మండలంలో ఎంటీయూ 1121, ఎంటీయూ 1153 రకాలు ముందుగా కోతకు వచ్చాయి. 50 శాతంకు పైగా కోతలు పూర్తిచేసి ధాన్యాన్ని తేమ శాతం తగ్గించుకోవడానికి ఆరబెట్టుకొనే స్థాయిలో మాసూళ్లు ఉన్నాయి. మంగళవారం కురిసిన వర్షంతో చాలా మంది రైతులు నష్టపోయారు. ఇదిలా ఉండగా, కోతకు కోయకుండా ఉన్న వరిచేలు భారీ ఈదురు గాలులకు నేలనంటాయి. వరి కోత యంత్రాలతో కోత కోసే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వలన కోత ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. యంత్రాలు కోయడానికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో సమయం పెరగడం వలన యంత్రాలకు అధికంగా ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఉందని వివరించారు. పంట చేతికందే సమయంలో కురిసిన వర్షం నిండా ముంచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపలు పడుతూ.. ఎర్రకాలువలో పడి వ్యక్తి మృతి


దల్లి రామాంజనేయులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: ప్రమాదవశాత్తు లక్కవరం సమీపంలోని ఎర్రకాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన దల్లి రామాంజనేయులు (49) అలియాస్ రామాంజి కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. ఖాళీ సమయంలో గేలం వేసుకుని చేపలు పడుతుంటాడు. మంగళవారం లక్కవరం పరిధిలో ఉన్న ఎర్ర కాలువలో గట్టుమీద కూర్చొని చేపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయాడు. కాలువ లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయి రామాంజనేయులు మృతి చెందాడు. లక్కవరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

దెందులూరు: కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల 26న తమకు అందిన సమాచారం మేరకు గుండుగొలను సమీపంలో డీసీఎం వాహనం తనిఖీ చేయగా మూడు టన్నుల కోడి వ్యర్థాలు ఉన్నాయన్నారు. డ్రైవర్ మోరు నరసింహస్వామి, వాహన యజమాని సైదులు బాల సత్యవతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

క్లుప్తంగా

ఫుట్‌పాత్‌లపై గోతులను సరిచేయండి



రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై గోతులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని యాగర్లపల్లి నుంచి కడకట్ల వైపు రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై ఇరువైపుల పెద్ద పెద్ద గోతులు ఉన్నాయని, ఆ గోతుల వల్ల అనేక మంది పాదచారులు ఊహించని విధంగా గాయాలపాలయ్యారని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతూ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వీఆర్‌కే హనుమంతురావు తాడేపల్లిగూడెం ఆర్‌అండ్ బి ఈఈకు, మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వంతెనపై లైట్లు తరుచూగా వెలగడం లేదని కొన్ని సందర్భాలలో ప్రయాదాలు జరుగుతున్నాయన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

తణుకు అర్బన్: పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో చేరే విద్యార్థులకు బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తణుకు పట్టణంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన ఈ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించారు. పాలిసెట్ నిర్వహణ అధికారులు సూచనల మేరకు విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 8 కేంద్రాల్లో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 2,624 మంది హాజరుకావాల్సి ఉండగా 354 మంది గైర్హాజరుతో 2270 మంది హాజరై పరీక్ష రాసినట్లు అధికారులు తెలిపారు.

కిశోర్ వికాశం క్యాంప్‌లు విజయవంతం చేయాలి

పెంటపాడు: ఈనెల 25 నుంచి జూన్ 10 వరకు ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసే కిశోర్ వికాశ సమ్మర్ క్యాంపులు సిబ్బంది విజయవంతం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని కోరారు. బుధవారం ఆమె పెంటపాడు ఐకేసీ మందిరం వద్ద అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టబోయే పనులపై చర్చించారు. సూపర్‌వైజర్లు సుజాత, జీజీబీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన



తణుకు సబ్‌జైల్‌లో ఆహారాన్ని రుచిచూస్తున్న న్యాయమూర్తి పీవీఎన్ రంజిత్‌కుమార్

తణుకు అర్బన్: తణుకు కోర్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎన్ రంజిత్ కుమార్ బుధవారం తణుకు సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ముద్దాయిలు ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకపోతే వారికి ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముద్దాయిలను కోర్టులో జరిగే వాయిదాలకు తీసుకు వెళుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలంతా జైలు నుంచి బయటకు వెళ్లిన తరువాత సత్ప్రవర్తతో మెలగాలని, సమాజానికి వ్యతిరేకంగా జీవించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ఎ.మోహనరావు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, ఎస్కే మోతి, ఎ.అజయ్ కుమార్, ముప్పిడి సుబ్బయ్య, సుజీవరావు పాల్గొన్నారు.

45 మార్కుల నిబంధన సరికాదు

తణుకు అర్బన్: టెట్‌లో అర్హత సాధించిన డీఈడీ, బీఈడీ అభ్యర్థులకు ఇంటర్మీడియేట్, డిగ్రీలో అన్ని కేటగిరీల వారికీ 40 శాతం మార్కులు ఉన్న వారికి డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌టీఎఫ్) జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి ఎస్‌వి జాకబ్ బాబు కోరారు. టెట్ పరీక్షకు ఇంటర్, డిగ్రీలో 40 శాతం మార్కులు వచ్చిన వారిని అనుమతించిన విద్యాశాఖ నేడు డీఎస్సీకి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీలో 45 శాతం మార్కులు ఉండాలనడం సరికాదన్నారు. ఇదే విధానాన్ని అనుసరిస్తే విద్యాశాఖ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొనాల్సి వస్తుందని స్పష్టం చేశారు. డిగ్రీ సబ్జెక్టులతో సంబంధం లేకుండా బీఈడీలోని మెథడాలజీని అనుసరించి డీఎస్సీకి స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత కల్పించాలని విద్యాశాఖను కోరుతున్నామని తెలిపారు.

కాలుష్య కోరల్లో అత్తిలి పంట కాలువ

- పంచాయతీ మురుగునీరు అవుట్‌లెట్లు కాలువల్లోకే
- వర్తక దుకాణాల చెత్తతో డంపింగ్ యార్డును తలపిస్తున్న అత్తిలి కాలువ
- జల కాలుష్యం నుంచి అత్తిలి కాలువను కాపాడాలంటున్న ప్రజలు



అత్తిలి పంచాయతీ కార్యాలయం సమీపంలో అత్తిలి కాలువలో కలుస్తున్న మురుగునీరు



అత్తిలి మండలం ఆరవల్లి హరిజనపేట వద్ద పంచాయతీ డ్రెయిన్ వాటర్ రేలంగి పంట కాలువలోకి కలుస్తున్న దృశ్యం



గృహాల గొట్టాల ద్వారా మురుగునీరు వస్తున్న దృశ్యం



అత్తిలిలో పంటకాలువ దృశ్యం

అత్తిలి: ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల అలసత్వంతో మండల ప్రజలకు సాగు, తాగునీరు అందించే అత్తిలి కాలువ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఒకప్పుడు అత్తిలి కాలువ నీటిని ఫిల్టర్ చేయకుండానే తాగునీరుగా ఉపయోగించేవారు. నేడు ఈ కాలువ నీటిలో దిగి స్నానాలు చేయడానికి కూడా ప్రజలు భయపడుతున్నారంటే ఏమేర కాలువనీరు కలుషితం అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. గోదావరి జలాలు అత్తిలి కాలువ ద్వారా మండలంలో గల 18 గ్రామాలకు తాగునీటితో పాటు సాగునీటి అవసరాలను తీరుస్తుంది. అత్తిలి ప్రధాన కాలువ నుంచి రేలంగి, ఉరదాళ్లపాలెం, తిరుపతిపురం, కెఎస్ గట్టు, పాలూరు, మంచిలి బ్రాంచి కెనాల్స్ ద్వారా ఆయా గ్రామాలకు తాగు, సాగు నీరు సరఫరా అవుతుంది. అత్తిలి మండలంలో 14వేల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు విస్తరించి ఉంది. అత్తిలి కాలువ నుంచి సరఫరా అయ్యే నీటినే సాగునీటి అవసరాలకు వినియోగిస్తుంటారు. అదే విధంగా గ్రామాలలో పంచాయతీలవారు కాలువ నీటిని చెరువులలో నింపి ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేసినా ఈనీటికి కేవలం గృహావసరాలకు మాత్రమే వినియోగిస్తుంటారు.

మురుగు డ్రెయిన్‌ను తలపిస్తున్న అత్తిలి కాలువ...

ప్రస్తుతం అత్తిలి కాలువ మురుగు డ్రెయిన్‌ను తలపిస్తోంది. కాలువ ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకు వస్తున్న చెత్త, వ్యర్థ పదార్థాలు, జంతు కళేబరాలకు తోడు కాలువ వెంబడి ఉన్న పలు వర్తక సముదాయ నుంచి వస్తున్న చెత్తను ప్రతి రోజు రాత్రి సమయాలలో కాలువలో పడవేయడంతో పంటకాలువ డంపింగ్‌యార్డుగా మారింది. అత్తిలి గ్రామంలో కాలువ వెంబడి ఉన్న పలు వ్యాపార దుకాణాల నుంచి మురుగునీటి గొట్టాలను కాలువలోకి పెట్టడంతో కాలువ నీరు కలుషితమౌతోంది. దీనికి తోడు అత్తిలి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామంలో మురుగునీరు డ్రెయిన్ అవుట్‌లెట్ ద్వారా కాలువలోకి కలుస్తోంది. కాలువ గట్టు వెంబడి ఉన్న నివాసగృహాలు వారు కూడా మురుగు నీటి గొట్టాలను కాలువలోకి డైరెక్ట్‌గా కలపడంతో సెప్టిక్ ట్యాంకు నుంచి వచ్చే నీరు కూడా కాలువలోకి వచ్చి చేరుతుంది. అత్తిలి మండలం ఆరవల్లిలో హరిజనపేటలో ఏర్పాటు చేసిన మురుగునీటి డ్రెయిన్ అవుట్‌లెట్‌ను పంచాయతీ అధికారులు రేలంగి పంటకాలువలోకి పెట్టారు. దీంతో గృహాల నుంచి వచ్చే మురుగునీరుతో పాటు పలువురు మరుగుదొడ్ల నుంచి వేస్ట్‌వాటర్‌ను కూడా గొట్టాల ద్వారా డ్రెయిన్‌లోకి వదులుతున్నారు. పూర్తిగా కలుషితమైన ఈమురుగునీటిని రైతులు పంటచేలకు మళ్లించుకుంటున్నారు.

ఈనీటిని తాగితే వ్యాధులు ప్రబలే అవకాశం

అత్తిలి కాలువ ద్వారా గ్రామాలకు సరఫరా అయ్యే ఈనీటిని తాగితే వ్యాధులు బారిన పడటం తథ్యం. అత్తిలి ప్రధాన కాలువ నుంచి బ్రాంచ్ కాలువల ద్వారా గ్రామాలలో పంచాయతీ చెరువులకు తాగు నీరు సరఫరా అవుతుంది. అయితే బ్రాంచ్ కాలువలపై ఉన్న పలు స్లూయిజ్‌ల వద్ద చెత్త, జంతు కళేబరాలు, వ్యర్థ పదార్థాలు నిలిచి ఉండటంతో తీవ్ర దుర్గంధభరిత, కలుషితమైన ఈనీటిని పంచాయతీ అధికారులు చెరువులలో నింపి ఫిల్టర్ చేసి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఫిల్టర్ చేసినా పూర్తిస్థాయిలో స్వచ్ఛత లేకపోవడంతో కలుషితమైన ఈనీటిని అధికశాతం మంది ప్రజలు కేవలం వంటింటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తుంటారు. పంచాయతీ సరఫరా చేసిన నీటిని తాగితే నీటి సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండటంతో, తాగునీటి కోసం గ్రామాలలో ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల నుంచి టిన్‌ల ద్వారా డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేసి తాగునీటి అసవరాలను తీర్చుకుంటున్నారు. ముఖ్యంగా అత్తిలి కాలువ శివారు ప్రాంతాలైన పాలూరు, కొమ్మర, ఈడూరు, మంచిలి, కంచుమర్రు, లక్ష్మీనారాయణపురం, ఉనికిలి గ్రామాల పరిధిలో ప్రవహించే బ్రాంచ్ కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. కొన్ని గ్రామ పంచాయతీలలో గ్రామంలో మురుగునీటి అవుట్‌లెట్‌ను పంచాయతీవారే పంటకాలువలోకి ఏర్పాటు చేయడం గమనార్హం. జల కాలుష్యం నుంచి కాపాడ్సిన అధికారులే ఇటువంటి చర్యలకు పాల్పడటంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలువల మరమ్మతుల నేపథ్యంలో ఇటీవల కాలువలకు నీటి సరఫరా నిలుపుదల చేయడంతో అత్తిలి ప్రధాన కాలువతో పాటు బ్రాంచ్ కాలువలు చెత్త, వ్యర్థ పదార్థాలతో దర్శనమిస్తూ, తీవ్రం దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దోమలు కూడా విపరీతంగా వ్యాప్తి చెందడంతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కాలువ నీటిని కాలుష్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలుష్యం నుంచి అత్తిలి కాలువను కాపాడాలి



సాగు,తాగునీటి అవసరాలను తీర్చే అత్తిలి కాలువను కాలుష్యం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలువ వెంబడి ఉన్న వర్తకదుకాణాల వారు చెత్తను కాలువలో పడవేయడంతో పాటు, మురుగు నీటి గొట్టాలను కాలువలో పెట్టడంతో పంటకాలువ మురుగు డ్రెయిన్‌గా మారింది. ఇరిగేషన్, పంచాయతీ అధికారులు కాలువ వెంబడి ఉన్న మురుగు డ్రెయిన్ గొట్టాలను నిరోధించి, జల కాలుష్యం నుంచి అత్తిలి కాలువను కాపాడాలి.

నూకపెయ్యి రామకృష్ణ, స్థానికుడు, అత్తిలి

పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయం చేసుకోవాలి

కొన్ని గ్రామ పంచాయతీల నుంచి వచ్చే మురుగునీటి అవుట్‌లెట్‌లు కాలువలో పెట్టారు. పంచాయతీ అధికారులు గ్రామంలో మురగనీరు బయటకు వెళ్లే విధంగా ప్రత్యామ్నాయంగా మురగనీరు అవుట్‌లను ఏర్పాటు చేసుకోవాలి. కాలువ నీటిని కాలుష్యం చేసేవారిపై గతంలో నోటీసులు జారీ చేశాం. పంచాయతీ అధికారులు కూడా ప్రత్యేక దృష్టి సారిస్తే కాలువ నీరు కాలుష్యబారిన పడకుండా కాపాడవచ్చు.

హరికృష్ణ, ఇరిగేషన్ ఇన్‌చార్జి ఏఈ, అత్తిలి సెక్షన్

ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడిగా అమూల్యారావు

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తణుకుకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు డీజే అమూల్యారావు తణుకు అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం తెలిపింది. మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతోపాటు నియోజకవర్గ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

ఉపాధి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ సంఘ నాయకులు

పెంటపాడు: జాతీయ ఉపాధి కార్మికులపై రాజకీయ వేధింపులు తక్షణం ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలో పలు గ్రామాలలో ఉపాధి పనుల పరిశీలన చేసి, అక్కడి సిబ్బందితో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ఎక్కువ శాతం మంది ఫీల్డ్‌సిబ్బంది మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత ఉపాధి సిబ్బందిపై ఒత్తిడులు తీవ్రంగా పెరిగిపోయాయన్నారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ 2014లో రాష్ట్రంలో అధికరణ అనంతరం ఉపాధిపై కేంద్ర నిధులు తగ్గిపోయాయన్నారు. చట్టం నీరుగారుతోందన్నారు. పని దినాలు తగ్గాయన్నారు. కూలీలకు కనీస వేతనం దక్కడం లేదన్నారు. ఈ సమావేశంలో ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం గ్రామాల మీదుగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

తణుకు అర్బన్: ఇరగవరం మండలంలోని గ్రామాల ప్రయాణికుల సౌకర్యార్థం తణుకు నుంచి ఇరగవరం, కంతేరు, ఆలమూరు, లంకలకోడేరు, వీరవాసరం మీదుగా భీమవరానికి తణుకు ఆర్టీసీ డిపో నుంచి ప్రతి రోజు మూడు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు సప్నా గిరిధర్‌కుమార్ తెలిపారు. ఈ బస్సులు ఉదయం 5.15, మధ్యాహ్నం 12.30, సాయంత్రం 5 గంటలకు తణుకు డిపో నుంచి బయలుదేరుతాయని, తిరిగి భీమవరం నుంచి ఉదయం 7.15, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 7.15 గంటలకు బయలుదేరుతాయని వివరించారు.

పుస్తక పఠనంతో మెదడుకు పదును



అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి సెలువులు వృథా చేయకుండా బాలలు పుస్తకాలు చదవడం, చదరంగం ఆడటం ద్వారా మెదడుకు పదును పెట్టాలని పలువురు వక్తలు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ కె సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చదివించడం, ఆంగ్లంలో మాట్లాడటం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక సంపదను పఠనం చేసి మేథాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, వి లక్ష్మణరావు, గంధం శేషవేంద్రరావు, ఎం శ్రీదేవి, వి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థినీ, విద్యార్థులు గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని పలువురు రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో బుధవారం మూడో రోజు వేసవి శిక్షణా శిబిరం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థులు 40 మంది శిక్షణలో పాల్గొన్నారు. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పంచతంత్ర కథలు, సీహెచ్ శ్రీదేవిచే లెక్కలు, ఆర్.నాగేంద్రకుమార్‌చే ఇంగ్లీషు, ఎ.జనర్ధానరావుచే సోషల్, జి.బాపయ్య శర్మచే ఎందుకు చదువుకోవాలి తదితర అంశాలను అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సోము వీర్రాజుకు సత్కారం



ఎమ్మెల్సీ సోము వీర్రాజును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నాయకులను తయారు చేసే కర్మాగారం బీజేపీ అని, కార్యదీక్షతో పనిచేస్తే పదువులు అవే వస్తాయని ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఈతకోట సత్యనారాయణ స్మారక కిరాణా వర్తక సంఘ భవనంలో బుధవారం గూడెం నియోజకవర్గ కార్యకర్తల స్థాయి విస్తృత సమావేశం జరిగింది. నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ అధ్యక్షత వహించారు. కార్యకర్తల విధులపై దిశా నిర్దేశం చేశారు. సోమ వీర్రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు టి.భోగేశ్వరరావు, కోట రాంబాబు, పసుపులేటి రామారావు, అయినంపూడి శ్రీదేవి నార్ని తాతాజీ, కౌన్సిల్ సభ్యులు కర్రి ప్రభాకర్ బాలాజీ తదితరులు మాట్లాడారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

రొయ్యల అమ్మకం అవుట్‌లెట్ ప్రారంభం

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం మెయిన్ రోడ్‌లో మార్కెట్‌కు వెళ్లే దారిలో షాపింగ్ కాంప్లెక్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా రొయ్య రైతుల ఆధ్వర్యంలో రొయ్యల అమ్మకం అవుట్‌లెట్‌ను బుధవారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయుల చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రొయ్యల వినియోగం పెంచడానికి అవుట్ లెట్ అమ్మకాలు ఎంతో ఉపయోగం పడతాయని తెలిపారు. ఎంపీపీ వీరవల్లి దుర్గ భవానీ, రాంబాబు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న జిల్లా సెక్రటరీ దాసం నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నందున జిల్లాలోని పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ జిల్లా సెక్రటరీ దాసం నాగేశ్వరరావు కోరారు. పెన్షనర్స్ భవనం వద్ద బుధవారం అసోసియేషన్ జిల్లా సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ యూనిట్ అధ్యక్షుడు బి.హరికుమార్ అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ కనీసం తగ్గించిన అడిషనల్ కోంటమ్ పునర్ధరణ జరగలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను, పీఆర్‌సీలు వచ్చే లోగా 30 శాతం ఇంటిరీయమ్ రిలీఫ్ ప్రకటించి, చెల్లించాలని, హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్య సదుపాయాలను అన్ని ఆసుపత్రులలో కలిగించాలని, మెడికల్ రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు పెంపుదల చేయాలని చెప్పారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి గాంధీరెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం గ్రామంలోని 1.74 ఎకరాలకు సంబంధించిన భూమిని అన్యాయంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ శ్యామల నాగమణి చేసిన ఆరోపణల్లో వాస్తవాలు లేవని ఆరోపణలు ఎదుర్కొంటున్న ముప్పిడి వెంకటరెడ్డి కుమారుడు ముప్పిడి గాంధీరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని వీరంపాలెం గ్రామంలో ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీరెడ్డి మాట్లాడుతూ 1990వ సంవత్సరంలోనే రెడ్డి సత్తిరెడ్డి వద్ద 1.74 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని గుర్తు చేశారు. అప్పట్లోనే పూర్తి సొమ్ములను చెల్లించినట్లు తెలిపారు. అయితే, స్థల యజమానికి చెందిన కుమార్తె వచ్చి పెద్దల సమక్షంలో ఎంతో కొంత ముట్టజెప్పాలని కోరడం జరిగిందన్నారు. అప్పటికీ రూ.7లక్షలు ఇచ్చేందుకు సిద్ధమయ్యామన్నారు. అప్పట్లో రిజిస్ట్రేషన్ చేయించుకోలేదన్నారు. అనంతరం శ్యామల నాగమణి అడ్డం తిరిగిందన్నారు. అయితే, ఈ భూమి విషయంలో అన్యాయంగా తమపై కేసులు పెట్టారని ఆరోపించారు. 1.74 ఎకరాల భూమికి సంబంధించి చుట్టూ ఉన్న రైతులకు సంబంధించిన రికార్డుల్లోనూ తమ పేరు ఉంటుందన్నారు. ఇదే విషయం గ్రామస్తులకు సైతం తెలుసునని పేర్కొన్నారు.

శ్రీవారి ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



కల్యాణ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీనీలాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసి, శ్రీవారిని దర్శించుకున్నారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అయన మాట్లాడుతూ తాను దేవాదాయ శాఖమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఆలయ నిర్మాణానికి రూ.కో టి మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేసిందన్నారు. రాష్ట్రంలోని పలు దేవాలయాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆలయాన్ని ఎంతో శోభాయమానంగా తీర్చిదిద్దారని ఆలయ కమిటీని అభినందించారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, కర్రి భాస్కరరావు, బొద్దాని శ్రీనివాస్, కొలుకులూరి ధర్మరాజు, కల్లేపల్లి రామకృష్ణంరాజు, బోణం వీరయ్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు నూనె రాధాకుమారి పాల్గొన్నారు.

రసాయనాలతో ముగ్గ పెడితే చర్యలు



తణుకులో పండ్ల వ్యాపారులతో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందరరామరెడ్డి

తణుకు అర్బన్: అరటి, మామిడి పండ్లను ముగ్గబెట్టేందుకు రసాయనాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎ.సుందర రామరెడ్డి హెచ్చరించారు. తణుకు సంతమార్కెట్‌లోని పండ్ల మార్కెట్‌లో ఆయన తనిఖీలు చేశారు. అయన మాట్లాడుతూ పండ్లు త్వరగా ముగ్గిపోయేలా ప్రమాదకరమైన రసాయనాలు వాడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. రసాయనాల ప్రభావంతో ముగ్గిన పండ్లు తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ మాట్లాడుతూ రసాయనాలు వినియోగించి పండ్లను ముగ్గబెట్టడం వల్ల ఎన్నో సమస్యలు వస్తాయని సహజసిద్ధంగా ముగ్గబెట్టిన పండ్లు మాత్రమే విక్రయిస్తామని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్విమింగ్ పూల్ పునఃనిర్మాణ పనులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తుందన్నారు. రానున్న రోజులలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి అరుంధతికి సత్కారం



జడ్జి అరుంధతిని సత్కరిస్తున్న గూడెం బార్ అసోసియేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి గుడివాడ బదిలీపై వెళ్తున్న డి.అరుంధతికు బార్ అసోసియేషన్ తరుపున ఘనంగా సత్కరించారు. అదే విధంగా విశాఖపట్నం నుంచి తాడేపల్లిగూడెం వచ్చిన కె.లలితాదేవికి స్వాగతం తెలిపారు. ఆమెకు ఘన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా జడ్జి సికిందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సూర్య కిరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, జనరల్ సెక్రటరీ పెదగాడి హెచ్‌వీఎస్ఎస్ భూపాల్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.